




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 10-02-2024 సంపుటి : 06 సంచిక : 154 పేజీలు : 8 వెల : రూ 3-00


## మాజీ ప్రధాని పీవీకి భారత రత్న.. సీఎం జగన్ హర్షం



తాడేపల్లి: ( విభారె) మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు, ఉన్నత రాజకీయ, నైతిక విలువలు కలిగిన పండితుడు. ఆయనకు అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించటం తెలుగు ప్రజలందరికీ గౌరవం. రైతుల కోసం పాటుపడిన మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, హరిత విప్లవ పితామహుడు వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా భారతరత్న ప్రదానం చేయడం యావత్ జాతి గర్వించదగ్గ విషయం" అని సీఎం జగన్ పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావుకు భారతరత్న వరించింది. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారతరత్నను శుక్రవారం ప్రకటించింది. పీవీతో పాటు మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం భారత తర్న ప్రకటించిన విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీటర్ వేదికగా వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సింపేట (మ) లక్నేపల్లిలో 1921 జూన్ 28న జన్మించిన పీవీ నరసింహారావు 1991లో భారత ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడయ్యాయడు. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించడంలో పీవీ కీలక పాత్ర పోషించారు. బహు భాషా కోవిదుడిగానూ పీవీ నరసింహారావుకు గుర్తింపు ఉంది. కాంగ్రెస్ ను కష్టకాలంలో ఆదుకున్న పీవీని ఆ తర్వాత కాంగ్రెస్ పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

## ప్రతి విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రను మింగించండి

### జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09-ప్రతి విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రను మింగించి చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం శ్రీశైలం జిల్లా పరిషత్ హైస్కూల్ లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించి 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగిస్తున్నామన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో మొత్తం 4,11,270 పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, అంగన్వాడీలు, పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను తప్పనిసరిగా మింగించాలన్నారు. 1-2 సంవత్సరాల వయసు చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి తల్లి పాలతో కలిపి చెంచా ద్వారా ఇవ్వాలని, 2-19 సం. వయసు పిల్లలలు మధ్యాహ్నము భోజనం తరువాత ఒక మాత్రను పూర్తిగా చప్పరించి నమిలి మింగించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు గైరు హాజరైన విద్యార్థులకు ఈనెల 16 వ తేది మాప్ అప్ రౌండ్ లో మాత్రలువేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డా.జఫరుల్లా, పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. షెహనాజీ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.×

# ప్రధాని మోడీతో సీఎం జగన్ భేటీ

**ఎన్నికల ముందు గంటన్నరపాటు సుదీర్ఘ చర్చ**
**పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం**
**పోలవరం, నిధులు తదితర అంశాలపై**
**చర్చించినట్లు సిఎంవో వెల్లడి**





న్యూఢిల్లీ,ఫిబ్రవరి9( విభారె) : పోలవరం సహా నిధుల విడుదలకు సంబంధించి ఎపి సిఎం జగన్ ప్రధానిని కోరారు. ప్రధాని మోడీతో గంటన్నరపాటు భేటీ అయిన సిఎం సమస్యలతో పాటు తాజా రాజకీయా లపైనా చర్చించినట్లు సమాచారం. అనంతరం ఆయన ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిశారు. ఈ క్రమంలోనేపోలవరం నిధులు విడుదల చేయాలని సీఎం జగన్ ప్రధాని మోడీని కోరారు. పోలవరం ప్రాజెక్ట్‌లో కాంపొనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేయడానికి కేంద్ర ఆర్థికశాఖ అంగీకరించిందని, దీంతో పాటు ప్రాజెక్టు తొలివిడతను సత్వర మే పూర్తిచేయడానికి రూ. 12,911 కోట్ల నిధుల విడుద లకూ అంగీకరిం చిందని, ఈరెండు అంశాలు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదరుచూ స్తున్నా యని, దీనిపై తక్షణమే దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. పోలవరం మొదటి విడత పూర్తిచేయడానికి దాదాపు రూ. 17, 144 కోట్లు ఖర్చు అవుతాయని, ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదన కూడా జలశక్తిశాఖ పెండి ంగ్‌లో ఉందని వెంటనే పరిశీలించి ఆమోదం తెలపాలని కోరినట్లుగా సీఎంవో తెలిపింది. పార్లమెంట్‌లో ప్రధాని మోదీతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు. ప్రధానమంత్రితో జరిగి న సమవేశాలు రాష్ట్రానికి చెందిన కీలక అంశాలపై చర్చ జరిగినట్లుగా సీఎంవో వర్గాలు తెలిపాయి. 2014 జూన్ నుంచి మూడేళ్లపాటు తెలంగాణ రాష్ట్రానికి ఏపీ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసిందని, దీనికి సంబంధించిన రూ. 7,230 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వీటిని చెల్లించేలా చూడాలని సీఎం కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా సహా ఇతర హామీలను కూడా అమలు చేయాల ని కోరిన సీఎం. రాష్ట్ర ఆర్థిక పురోగతి కి ప్రత్యేక హోదా అవసరమని, పెట్టుబడులు రావడమే కాకుండా తద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు ఏర్పాడతాయని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించామని, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండేలా రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని, ఇప్పటికే కొన్ని కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయని ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లిన సీఎం... కాలేజీల ఏర్పాటుకు సంబంధించి తగిన సహాయ సహకారాలు అందిం చాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానించేలా ప్రతిపాదించిన భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖపట్నం పోర్టులను కలిపే 55 కిలోమీటర్ల 6 లేన్ల రహదారికి తగిన సహాయ సహకా రాలు అందించాలని సీఎం కోరారు.


# 11 నుంచి లోకేష్ శంఖారావం



విశాఖపట్టణం, ఫిబ్రవరి 9 ( విభారె) నారా లోకేష్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. గత కొద్ది రోజులుగా లోకేష్ పెద్దగా బయటకు కనిపించడం లేదు. జనసేనతో పొత్తులు, సీట్ల సర్దుబాటు, అభ్య ర్థుల ఎంపిక వంటి విషయాల్లో బిజీగా ఉన్నారు. అవన్నీ కొలిక్కి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు బిజెపి సైతం కూటమిలోకి వచ్చే అవకాశం ఉంది. పొత్తుపై మూడు పార్టీలు సంయుక్తంగా కీలక ప్రకటన చేసే ఛాన్స్ కనిపిస్తోంది. దీంతో లోకేష్ రాష్ట్రవ్యాప్త పర్యటనలకు సిద్ధమయ్యారు. శంఖా రావం పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. యువ గళం పాదయాత్రలో టచ్ చేయని నియోజకవర్గాల్లో శంఖారావసభలు కొనసాగనున్నాయి. గత ఏడాది లోకేష్ పాదయాత్ర చేసిన సంగతి తెలిసిందే. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి విశాఖ జిల్లా అగనం పూడి వరకు మూడు వేల కిలోమీటర్ల కు పైగా లోకేష్ నడిచారు. వాస్తవానికి ఆయన పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగా షెడ్యూల్ రూపొందించారు. కానీ మధ్యలో చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో చాలా రోజులపాటు పాదయాత్ర నిలిచిపోయింది. చంద్రబాబు కేసుల పర్యవేక్షణలో భాగంగా లోకేష్ పాదయాత్రను నిలిపివేయాల్సి వచ్చింది. చంద్రబాబుకు బెయిల్ లభించిన తరువాత పాదయాత్రను తిరిగి ప్రారంభిం చారు. కానీ షెడ్యూల్ ను కుదించారు. విశాఖ నగర శివారులోని అగనంపూడి తో సరిపెట్టారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోవిజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. అయితే లోకేష్ పాదయాత్రచేయనిశ్రీకాకుళం,విజయనగరంజిల్లాల్లో ముందు గా శంఖారావసభలతో లోకేష్ ఎన్నికల ప్రచారం ప్రారంభించ ను న్నారు. సుమారు 50 రోజులపాటు ఈ శంఖారావయాత్రలు కొనసాగునున్నాయి. పాదయాత్రలో భాగంగా టచ్ చేయని నియోజకవర్గాల్లో లోకేష్ పర్యటన ఉంటుంది. ఈనెల 11న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో తొలి సభ ఉంటుంది. రోజుకు మూడు నియోజకవర్గాల్లో పర్యటన ఉండనుంది. సుమారు 50 రోజుల పాటు 150 నియోజకవర్గాలు కవర్ అయ్యేలా లోకేష్ పర్యటనలు కొనసాగునున్నాయని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పొత్తుల ప్రకటన, సీట్ల సర్దుబాటు తర్వాత చంద్రబాబు దూకుడు పెంచే అవకాశం ఉంది. ఇప్పటికే రా కదలిరా పేరుతో ఇంకా ఐదు సభలు పెండింగ్ లో ఉన్నాయి. ముందుగా చంద్రబాబు వాటిని పూర్తి చేయనున్నారు. పొత్తు కుదిరిన తర్వాత బిజెపి అగ్ర నేతలు, పవన్ కళ్యాణ్ తో ఉమ్మడిగా చంద్రబాబు ప్రచార సభల్లో పాల్గొనున్నారు. దీనికి సంబంధించి కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇంతలో లోకేష్ శంఖారావ సభలు కూడా ప్రారంభం చేయాలని ఒక నిర్ణయానికి వచ్చారు. తొలుత ఉత్తరాంధ్రలో పూర్తిచేయాలని భావిస్తున్నారు.

## దేశ ఆర్థికాభివృద్ధిలో పీవీది కీలకపాత్ర : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9( విభారె) తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న వరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. పీవీకి భారతరత్న వరించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఓ రాజీతిజ్ఞుడిగా ఈ దేశానికి పీవీ నర్సింహారావు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా పీవీ అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. 'ఓ రాజనీతిజ్ఞుడిగా ఈ దేశానికి పీవీ నర్సింహారావు వివిధ హోదాల్లో విస్తృతమైన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా, అనేక సంవత్సరాల పాటు పార్లమెంటు, శాసనసభ సభ్యునిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. భారతదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో పీవీ దూరదృష్టి గల నాయకత్వం కీలకపాత్ర పోషించింది. ఈ దేశ శ్రేయస్సు, అభివృద్ధికి బలమైన పునాది వేసింది' అని అన్నారు. భారతదేశం ప్రపంచ మార్కెట్ దృష్టిలో పడింది పీవీ హయాంలోనే అని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. దేశం ఆర్థికా భివృద్ధి దిశగా కొత్త అడుగులు వేసింది కూడా ఆయన పాలనలోనే అని వివరించారు. విదేశాంగ నిపుణుడిగా, విద్యా రంగ కోవిదుడిగా పీవీ అందించిన సహకారం భారతదేశాన్ని సాంస్కృతికంగా, మేథో పరంగా సుసంపన్నం చేసిందని కీర్తించారు.



## తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలకు గుర్తింపు

**పివికి భారతరత్న రావడం గర్వకారణం**
**స్వాగతించిన సిఎం రేవంత్, డిప్యూటి భట్టి**

హైదరాబాద్,ఫిబ్రవరి9( విభారె) తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన మన తెలంగాణబిడ్డ, మాజీప్రధాని ఆర్థిక మేధావి, బహుభాషా కోవిదుదు పీవీ నర్సింహారావు కు భారతరత్న దక్కడం గర్వించదగిన విషయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ బిడ్డలుగా మనందరి గుండెల్లో ఆనందం ఉప్పొంగే క్షణమిది అని అన్నారు. పీవీతో పాటు మాజీ ప్రధాని చరణ్ సింగ్, ఎల్ కేఅద్వానీ, కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించడంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలు తెచ్చి ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. పీవీ నరసింహారావు కుటుంబానికి తెలంగాణ ప్రజల తరపున రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పీవీకి భారత రత్న దక్కడం పట్ల డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

శనివారం 10-02-2024

## జాతీయ సమస్యగా వాయు కాలుష్యం

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మాత్రమే నీలి ఆకాశం కనబడుతోంది. గాలి నాణ్యత తీవ్రతకు ఇదొక సంకేతం. వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాల్లోని నలుసు పదార్థాల (పీఎం) సాంద్రత 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రో గ్రాములు మించకూడదు. ఇది ఢిల్లీ లాంటి నగరంలో 102. ఈ గాలిని పీల్చడం ప్రాణాంతకం. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి తెచ్చిన 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం' కొంతమేరకు ఫలితమిస్తున్నా అది సరిపోదు. మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో మనం వ్యవహ రిస్తున్నాం. ప్రజారోగ్య దృక్కోణం నుండి చూస్తే ఎంత ప్రగతి అయినా తక్కువే. నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే మెరుగైన ఫలితాలను ఇస్తుంది. శీతకాలపు నెలల్లో భారీ పొగమంచుతో కప్పబడి ఉండే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో నీలి ఆకాశం, ప్రకాశవంతమైన సూర్యబింబం అరుదుగా గోచరిస్తుంటాయి. అయితే పేలవమైన గాలి నాణ్యత అనేది ఇప్పుడు జాతీయ సమస్య అయింది. కాకపోతే గత ఐదేళ్లలో, వాయు కాలుష్యం ఒక విధానపరమైన సమస్యగా కూడా గుర్తింపు పొందింది. అయిన ప్పటికీ 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ' (ఎన్‌సీఏపీ) అయిదేళ్ల అంచనాను పరిశీలిస్తే, అర్థవంతమైన, శాశ్వతమైన ప్రయోజనాలను అందించడానికి గట్టి ప్రయత్నాలు అవసరమని తెలుస్తుంది. అపఖ్యాతి పాలైన భారతదేశ గాలి నాణ్యతను పరిష్కరించడానికి తెచ్చిన మొదటి విధానం ? 2019లో ప్రారంభించిన ఎన్‌సీఏపీ. కాలుష్య స్థాయిలను, గాలిలోని నలుసు పదార్థాల గాఢతలను ప్రధాన నగరాల్లో 30 నుంచి 20 శాతం తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. దీనికి కేంద్రం నుండి రూ. 443 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 4,400 కోట్ల ప్రారంభ కేటాయింపులు జరిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి చెందిన నిరంతర పరిసర వాయు నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాల విశ్లేషణ (భారత దేశ వాయు నాణ్యతా మానిటర్ల నెట్‌వర్క్) పురోగతి స్థిరంగా ఉన్నప్ప టికీ, ఎన్‌సీఏపీని అమలు చేయడంలో వ్యూహాత్మకమైన, సైన్స్ ఆధారిత మార్పుల అవసరం ఉంది. ఉదాహరణకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గాల్లోని నలుసు పదార్థాల (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతకు పరిమితులు నిర్దేశించింది. 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు, 10 పీఎం అయితే ఒక క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించకూడదు. ఎన్‌సీఏపీ అమలయ్యాక, ప్రత్యేకించి 2.5 పీఎం వారణాసిలో 96 నుంచి 26.9 మైక్రోగ్రాములకు తగ్గింది. ఆగ్రాలో 73 నుంచి 33కు, జ్యోద్‌పూర్‌లో 81.8 నుంచి 40.6కు మెరుగ్గా తగ్గింది. కానీ ఢిల్లీలో మాత్రం 108 నుంచి 102కు మాత్రమే తగ్గింది. పీఎం 2.5 స్థాయుల డేటా 2019?2023 మధ్య 46 నగరాలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం 27 నగరాల్లో మాత్రమే తగ్గుదల మెరుగ్గా ఉంది. 10 పీఎం విషయంలో ఐదేళ్ల డేటా కేవలం 46 నగరాలకు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 24 నగరాల్లో మాత్రమే మెరుగుదల కనబడింది. 50 శాతం నగరాలు గణనీయమైన అభివృద్ధిని చూపుతున్నా యనీ, ఇది ఎన్‌సీఏపీ విజయవంతమైన ప్రగతిని సూచిస్తోందనీ ఎవరైనా వాదించవచ్చు. కానీ మనం మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో వ్యవహరిస్తున్నాము. పైగా రక్తపోటు, మధుమేహం వంటివాటిని ఇవి మరింత తీవ్రతరం చేయవచ్చు. 2.5 పీఎం రక్త?మెదడు అవరోధాన్ని కూడా దాటవచ్చు. దీర్ఘకాలం అలాంటి గాలిలో మసలితే ప్రాణాంతకం అవుతుంది. కాబట్టి, ప్రజారోగ్య దృక్పథం నుండి చూస్తే మరింత కఠినమైన ప్రగతి అత్యవశ్యం. మరో సమస్య ఏమిటంటే, ఎన్‌సీఏపీలో సమన్వయం కొరవడింది. ఢిల్లీ లాంటి నగరంలో సరి?బేసి ట్రాఫిక్‌ను అమలు చేయడం, 'జాతీయ రాజధాని ప్రాంతం' నుండి నిబంధనలు పాటించని వాహనాలను తొలగించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడాన్ని నిరోధించడం, దుమ్మును తగ్గించడానికి రోడ్లపై నీటిని చల్లడం వంటి చర్యలు అన్నీ అమలవుతున్నాయి. అయినప్పటికీ, కాలుష్యానికి సంబంధించిన ఇవే కారణాలు ఉన్న మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుంటే ఈ చర్యలు సరిపోవు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగమంచుతో చలి కాలం ప్రారంభం కావడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఢిల్లీ నగరంలో నమోదైన సుమారు 80 లక్షల వాహనాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉష్ణోగ్రతలో తగ్గుదల గాలిలో నిలిచివుండే అణువుల స్థాయిలను ప్రమాదకరంగా పెంచుతుంది. ఈ కాక్‌టెయిల్‌ను ఢిల్లీ నివాసులు ప్రతి సంవత్సరం కొన్ని వారాల పాటు పీల్చుకుంటున్నారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) ప్రతి శీతాకాలంలో ఢిల్లీ?జాతీయ రాజధాని ప్రాంతంలో ఊహించిన ప్రతిస్పందనగా అమలులోకి వస్తుంటుంది. అయితే దాని ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సజావుగా సమన్వయం లేకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. జాతీయ రాజధాని వెలుపల, సీపీసీబీ పర్యవేక్షణ నెట్‌వర్క్ అసమానంగా ఉందని మా విశ్లేషణ చూపుతోంది. ఇది మూల్యాంకనానికి వ్యత్యాసాల పొరను జోడిస్తుంది. ముజఫర్‌పూర్, బిహార్ లాంటి రద్దీ ప్రదేశాలలో కేవలం మూడు మానిటర్లు ఉన్నాయి. అదే ఢిల్లీ అంతటా 37 స్టేషన్‌లు, ముంబై అంతటా 22, హైదరాబాద్‌లో 14 స్టేషన్లు ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉంది. ప్రామాణిక పర్యవేక్షణ విధానంలో, పోల్చదగిన జనాభా ఉన్న నగరాలు ఒకే విధమైన లేదా కనీసం సారూప్య సంఖ్యలో గాలి నాణ్యత మానిటర్లను కలిగి ఉంటాయి.,

## ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09-రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా. శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారులు మరియు పోలీసుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్ లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ఆటోలను అతి వేగంగా నడుపుతూ, ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా ప్రమాదాల బారిన పడుతున్న సంగటనలను, వివరించారు. ప్రమాదాల్లో వారితో, పాటు ప్రయాణికుల ప్రాణాలు కూడా పోతాయని, ఇరు కుటుంబ సభ్యులకు తీరనివేదన మిగులు తుందన్నారు. ఆటో స్టాండ్ లలో ప్రజలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది కలుగ కుండ ఆటో లు స్టాండ్ వద్ద నే నిలపాలని సూచించారు పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను బట్టి ఆటో స్టాండ్ లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆటో ఫిట్నెస్ చూసుకోవాలి, పొగ ద్వారా పొల్యూషన్ వచ్చే ఆటోలను నడపవద్దు, అలాగే పరిమితికి మించి ఆటోలలో ఎక్కించుకొని నడపరాదు, ముఖ్యంగా స్కూల్ పిల్లలను పరిమితికి మించి ఎక్కించుకోరాదు, ఆటో డ్రైవరు కు వెనుక వాహనాలు కనిపించు టకు ఆటో వెనుక ఎలాంటి ప్రకటనల పోస్టర్లు అంటించరాదు. నంద్యాల సిటి అంతా ప్రయాణికుల దగ్గర ఒకే విదంగా ఆటో ఛార్జీలు తీసుకోవాలన్నారు, చార్జీల విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ జంక్షన్ ల వద్ద ఫ్రీ లెఫ్ట్ లను జామ్ చేయరాదు, ఆటో లకు కేటాయించబడిన రెండవ లైన్ లో మాత్రమే ఆటోను నడపా లి, ఆటోలను అతివేగంగా మరి యు త్రాగి నడిపి ప్రజల ప్రాణా లతో చెలగాటం ఆడవద్దు. సూచించారు. ఈ కార్యక్రమం లో రవాణా శాఖ ఎంవిఐ రవిశంకర్ నాయక్, ట్రాఫిక్ సిఐ ఇస్మాయిల్ భాష, 11 వ వార్డు కౌన్సిలర్ తమీమ్, రెడ్ క్రాస్ ప్రతినిధి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి మహేందర్ రెడ్డి...



హైదరాబాద్, ఫిబ్రవరి 9 లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ కాంగ్రెస్‌లోకి వలసల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ఎమ్మెల్యేలు, ఎంపీలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినా... మర్యాదపూర్వకమేనంటూ దాట వేశారు. అయితే ముఖ్యమంత్రి సొంత జిల్లాకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి పట్నం మహేందర్‌రెడ్డిదంపతులు కాంగ్రెస్‌లో చేరనున్నారు. ముఖ్యమంత్రిని కలిసి సంసిద్ధత వ్యక్తం చేశారు. వారం రోజుల్లో వారు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది... మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి, వికారాబాద్ జిల్లాపరిషత్ ఛైర్మన్ సునీతారెడ్డ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి అంగీకారం తెలిపారు. మహేందర్‌రెడ్డితో పాటు తాను, అనుచరగణంతో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సునీతారెడ్డి ముందుగానే తెలపగా....సీఎంను కలవడంతో వారు చేరిక ఖాయమని తేలిపోయింది. వారం రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. డిల్లీ వెళ్లి మల్లికార్జునఖర్గే సమావేశంలో చేరాలా లేక...కొండగల్ లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభలో చేరాలా అన్నదానిపై త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తామన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందే వీరు కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావించినా... బీఆర్ఎస్ అధిష్టానం అప్రమత్తమైంది. మహేందర్‌రెడ్డికి అప్పటికప్పుడు మంత్రిపదవి ఇచ్చి కాస్త చల్లబరిచారు. శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర ఓటమితో ఇప్పుడు వారు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. మహేందర్‌రెడ్డి మద్దతుదారులు ఇప్పటికే చాలామంది కాంగ్రెస్‌లో చేరారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, సీనియర్ నాయకులు రవి గౌడ్, కరణం పురుషోత్తంరావ్ తదితరులు పట్నం వెంట వెళ్లనున్నారు. వికారాబాద్ జెడ్పీ ఛైర్మన్‌గా ఉన్న సునీతారెడ్డి చేవెళ్ల ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతోనే వారు సీఎం రేవంత్‌రెడ్డిని కలసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. తాండూరు ఎమ్మెల్యే టిక్కెట్ మహేందర్‌రెడ్డి ఆశించగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి బీఆర్ఎస్ కేటాయించింది. దీంతోపాటు మరో నేత మెతుకు ఆనంద్‌తో నెలకొన్న విభేదాల కారణంగానే మహేందర్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలిసింది. మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డి మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉండనున్నారు. వారు కనీసం తనకు మాట మాత్రం కూడా చెప్పలేదన్నారు. శాసనసభ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరదామమని వారు ప్రపోజల్ పెట్టినా....తానే వారించానన్నారు. ఇప్పుడు వారు ఇష్టపూర్వకంగానే కాంగ్రెస్‌లో చేరారని నరేందర్‌రెడ్డి తెలిపారు. రాజకీయాల్లో ఎవరి ఇష్టం వారిదన్న నరేందర్‌రెడ్డి......తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. ఈయన గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు.

రేవంత్‌ను ఓడించి...ఆయన పక్కకే చేరిక రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరంటారు. వికారాబాద్ జిల్లా రాజకీయాలను ఒకపక్క రేవంత్‌రెడ్డి, మరోపక్క పట్నం మహేందర్‌రెడ్డి శాసించారు. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా బీఆర్ఎస్ అధిష్ఠానం అప్పటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. అప్పుడు ఆయన తన సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డిని రంగంలోకి దింపి....తన అనుభవాన్ని, అధికారాన్ని ఉపయోగించి రేవంత్‌రెడ్డిని సొంత నియోజకవర్గంలో తొలిసారి ఓటమిపాలు చేశారు. ఆ తర్వాత ఆయన మల్కాజ్‌గిరి ఎంపీగా గెలవడం, పీసీసీ అధ్యక్షుడితో పాటు ఒంటిచేత్తో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం జరిగింది. ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి సమక్షంలో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

## వేసవికాలం ప్రారంభంలోనే తెలంగాణకు వర్ష సూచన.. ఈ ప్రాంతాల వారికి ఉపశమనం..

తెలంగాణలో ఫిబ్రవరి 10 లేదా 11న అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ వేసవిలో ఉష్ణోగ్రతలు ప్రారంభమైయ్యాయి. నిన్న, మొన్నటి వరకు ఎముకలు కొరికే చలితో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అయితే ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో ఉక్కపోత ప్రారంభమైంది. గత నెల ఫ్యాన్ వేసుకోవడానికి ఇష్టపడని వారు ఏసీల కోసం, చల్లని వాతావరణం కోరుకుంటున్నారు. అయితే ఈ ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు తొలకరి జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నిన్న తెలంగాణలోని సూర్యాపేటలో 38.4 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రత చేరుకుంది. దీంతో రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు పెరిగాయి. మారేడ్‌పల్లిలో 37.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్‌ను తాకింది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని గోల్కొండ, నాంపల్లి, చార్మినార్ వంటి ప్రదేశాల్లో 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. తెలంగాణలో శని లేదా ఆదివారాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వేసవి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 10-11 మధ్య ఉత్తర తెలంగాణలో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. రాబోయే 5-6 రోజులలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్ 21 బాటిల్లు స్వాధీనం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09-నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదేశాలమేరకు అక్రమ మద్యం నాటు సారాయి నిర్మూలనే లక్ష్యంగా అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తినీ అరెస్టు చేసిన పోలీసులు. వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో మోత్కూరు గ్రామం నందు అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని వెలుగోడు సబ్ ఇన్స్పెక్టర్ భూపాలుడు గారి ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పట్టుకోవడం జరిగింది. అతని వద్ద నుండి 21- (180 ఎమ్ ఎల్) మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు .

## ఓపిఎస్ ను మేనిఫెస్టో లో ప్రకటించాలి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 9 డోన్ యూటీఎఫ్ డోన్ పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు డోన్ యుటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు అధ్యక్షతన ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులందరికీ ఓపిఎస్ ఇవ్వాలన్నారు. ఓపిఎస్ ఇచ్చేవరకు పోరాటం చేస్తామని చెప్పారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్లు పంపిణీ చేశారు. ఏ రాజకీయ పార్టీ అయినా సరే మీ మేనిఫెస్టో లో సిపిఎస్ రద్దు చేస్తామని చేర్చాలని డిమాండ్ చేశారు. ఎవరైతే ఈ డిమాండ్ ను అమలు పరుస్తారో వారికే ఉద్యోగులు సపోర్ట్ చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు కేశవరెడ్డి, సుదర్శన్, రాణి, ప్రసాద్, రామక్రిష్ణ, గంగాధర్, మనోహర్, ఇబ్రహీం, సురేష్, గ్రేసమ్మ, గాలి స్వామి, గోవిందరెడ్డి, వీరారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుజాత, నాయక్, ఇంతియాజ్, మురళి కృష్ణ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ పై వెలుతున్న ఆళ్ళగడ్డ డిఎస్పి వెంకట్రామయ్య కు ఘనంగా సన్మానం



వీడ్కోలు సమావేశం లో మాట్లాడతున్న ఆళ్ళగడ్డ రూరల్ సీఐ హనుమంత్ నాయక్

ఆళ్ళగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 09 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ సబ్ డివిజన్లో సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ గా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న డిఎస్పి వెంకటరామయ్యను శుక్రవారం ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ సిఐలు, ఎస్ఐలు, పోలీసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో డి.ఎస్.పి వెంకటరామయ్య అంకితభావంతో పనిచేసి సబ్ డివిజనల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపారని, శాంతిభద్రతలకు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ, రూరల్ సిఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, సిరివెళ్ల సిఐ వంశీధర్, కోవెలకుంట్ల సిఐ జయచంద్ర, కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డి, ఎస్సైలు షేక్ నగీనా, వెంకట్ రెడ్డి, సబ్‌డివిజన్‌లోనిఎస్‌ఐలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్‌లో హింస..

డెహ్రాడూన్: ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పర్యాటక రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో హింస చెలరేగింది. హల్ద్వానీ ప్రాంతంలో అక్రమ కట్టడాలు కూల్చేందుఉకు వచ్చిన అధికారులు, పోలీసులపై స్థానికులు దాడికి దిగారు. ఈ దాడితో హింస చెలరేగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. వందమందికిపైగా గాయపడ్డారు. ఘర్షణలను అదుపు చేసేందుకు ఖర్ఫ్యూ విధించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించేందుకు కోర్టు ఇటీవల ఆదేశాలిచ్చింది. దీంతో అధికారులు కూల్చివేతల దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు అధికారులపై రాళ్లు రువ్వడంతో ఘర్షణలు ప్రారంభమయ్యాయి.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు సిద్ధం చేయండి...

**- సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్- డా.కె.శ్రీనివాసులు..**



విభారె న్యూస్ శ్రీశైలం ఫిబ్రవరి 09..శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేస్తున్న విస్తృత ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండాఅన్నిరకాల ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులుసంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అన్నపూర్ణ భవనం ప్రక్కన గల సీసీ కంట్రోల్ రూమ్ నందు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి,దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కలెక్టర్- డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మార్చి 1 నుండి 11 వరకు 11 రోజులపా టు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తేలికగా మల్లన్న దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరుకునే వరకు బాధ్యతాయుతంగా అధికారులకు అప్పగించిన పనులను నిర్వహించారు. ప్రధానంగా క్యూలైన్లు, త్రాగునీటి సదుపాయం, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై అప్పగించిన విధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వర్తించాలని సంబంధిత శాఖల అధికార ులను కలెక్టర్ ఆదేశించారు. రద్దీ ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలతో పాటు వైద్యనిపుణులు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. అలాగే దోమలను అరికట్టేందుకు ఫాగింగ్ మెటిరీయల్ సిద్ధంగా ఉండాలని మలేరియా అధికారిని ఆదేశించారు. శ్రీశైలంలోని పిహెచ్‌సి,దేవస్థానం ఆసుపత్రి,సున్నిపెంటలోని వై ద్యశాల,శ్రీశైలంలో ఏర్పాటు చేసే తాత్కాలిక 30 పడకల ఆసుపత్రి 24 గంటలపాటు నిర్వహించేలా వైద్యసిబ్బందిని కేటాయించాలని డి.ఎం. అండ్ హెచ్.ఓను ఆదేశించారు. ముఖ్య ప్రదేశాలలో రెండు షిఫ్టులలో వైద్యులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు 108 అంబులెన్సులు, పాదయాత్రమార్గములో ఒక అంబులెన్సును ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రాహ్మణకొట్కూరు నుండి శ్రీశైలం వరకు గతంలో సూచించిన విధంగా 31 ప్రదేశాలలో తాత్కాలిక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాతాళగంగ, లింగాలగట్టు ప్రాంతాలలో పుణ్యస్నానాలాచరించేందుకు అనుమతిస్తున్నామని, ఇందుకు ప్రతిపాదించిన గజ ఈతనిపుణులు, అవసరమైన లైఫ్ జాకెట్లు, పుట్టీలు, తాత్కాలిక టాయిలెట్లు, డ్రస్సింగ్ గదులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధకారులను,దేవస్థానం పారిశుద్ధ్య విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారులను కలెక్టర్ ఆదేశించారు. శివదీక్షా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, కార్యనిర్వహణాధికారివారిని సూచించారు. రవాణా సౌకర్యాల నిమిత్తం ఆంధ్ర ప్రాంతం నుండి 500 బస్సులు, తెలంగాణా నుండి 450 బస్సులు, కర్ణాటక రాష్ట్రం నుంచి 170 బస్సులు కండిషన్‌లో ఉన్న బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత రీజినల్ మేనేజర్లు కలెక్టర్‌కు వివరించారు. అలాగే మార్గమధ్యములోని ముఖ్య కూడళ్ళలో క్రేన్లు, అవసరమైన మెకానిక్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ ఆర్.ఎం.లను ఆదేశించారు. వీఐపీలు, వీవీఐపీలు, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలు రాకుండా దేవస్థాన గదులు, ప్రవైటు సత్రాలలోని 35 శాతం గదులను స్వాధీనం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్‌డిఓను ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటారని, ఎక్కడ పారిశుద్ధ్యలోపం లేకుండా అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించుకుని దేవస్థాన శానిటేషన్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పారిశుద్ధ్యలోపం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిపిఓను, జిల్లా పరిషత్ సీఈఓను కలెక్టర్ ఆదేశించారు. అన్నదానశిబిరాలు, రద్దీ కూడలి ప్రాంతాలలో అధిక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. ఆత్మకూరు నుండి దోర్నాల వరకు రోడ్డు ప్యాచింగ్ మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు, రోడ్డుకిరువైపులా మట్టితో చదును చేసే పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బి ఈఈని కలెక్టర్ ఆదేశించారు. మార్చి 1 నుండి 11వ తేదీ వరకు అత్యధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి వచ్చే అవకాశం ఉన్నందున అదనపు సౌకర్యాలు కల్పించడంతో పాటు సిబ్బంది మొత్తం అప్రమత్తంగా వుండి, భక్తులకు సేవలు అందించే కార్యక్రమంలో నిమగ్నం కావాలన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు మాట్లాడుతూ భక్తులకు సులభంగా స్వామివారి దర్శనం అయ్యేలా నాలుగు రకాల క్యూలైన్లను ఏర్పాటు చేశామని కలెక్టర్‌కు వివరించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలలో 20 శాతం అదనంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు వివరించారు. మహాశివరాత్రి పర్వదినం రోజు 1.10 లక్షల మంది స్వామివార్లను దర్శించుకునే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అలాగే దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి మాట్లాడుతూ భక్తులకు అందించే స్వామిఅమ్మవార్ల లడ్డూ ప్రసాదాలను 35 లక్షల వరకు తయారు చేస్తున్నామన్నారు. మార్చి 8వతేదీ మహాశివరాత్రిపర్వదినాన్ని పురస్కరించుకుని సాయంకాలం ప్రభోత్సవం అనంతరం రాత్రి 10 గంటల నుండి పాగాలంకరణ,లింగోద్భవ కాల మహాన్యాస రుద్రదాభిషేకం,అర్థరాత్రి 12 గంటలకు కల్యాణోత్సవం తదితర వైదిక కార్యక్రమాలన్నీ సంప్రదాయబద్దంగా నిర్వహిస్తామన్నారు. మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం ఉంటాయని కలెక్టర్‌కు వివరించారు. ప్రధానంగా త్రాగునీటికి ఇబ్బంది లేకుండా గుర్తించిన ప్రదేశాలలో ట్యాంకర్లు, నీటికొళాయిలు ఏర్పాటుకు దేవస్థానం ఈఈ వి. రామకృష్ణతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 11 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు దాదాపు 10 లక్షల మందికి పైగా భక్తుల వచ్చే అవకాశం ఉన్నందున మొబైల్ నెట్ వర్క్ సరిపోయే విధంగా ఏపి ఫైబర్ నెట్ వారితో సమన్వయం చేసుకొని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులను ఆదేశించారు. కల్తీ ఆహారపదార్థాలు నియంత్రించేందుకు లేబరు కమిషనర్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను టీమ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని జోన్లకు నిరంతరాయ విద్యుత్ ఏర్పాటు చేయాలని ఏపిఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి కె. రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ దోర్నాల నుంచి ట్రాఫిక్ అంతరాయం లేకుండా మార్గమధ్యంలో కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా సిస్టమును డెవలప్ చేసుకోవాలన్నారు. శ్రీశైలం ముఖద్వారం ? సాక్షిగణపతి ప్రదేశాలలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని దేవస్థానం, అటవీశాఖ అధికారులకు సూచించారు. సాక్షిగణపతి ప్రదేశంలో రోడ్డుకిరువైపులా తాత్కలికంగా గ్రావెల్ వేసి విస్తరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తులు తొక్కిసలాటలు లేకుండా అవసరమయ్యే మంచినీరు, చంటిపిల్లలకు పాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కార్యనిర్వహణాధికారిని సూచించారు. భారీ వాహనాలను అటవీమార్గంలో అనుమతించకుండా డైవర్ట్ చేసే విధంగా ప్రకాశం, నాగర్ కర్నూలు, కర్నూలు జిల్లాలలో విస్తృత ప్రచారం చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్, సంబంధిత ట్రాఫిక్ డిస్పీలను ఆదేశించారు. గతంలో మాదిరిగానే ఏర్పాటు చేసిన 75 సీసీ కెమెరాలతో పాటు అదనంగా అవసరమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలతో కవరేజ్ చేయడంతో పాటు డ్రోన్ కెమెరాలతో కూడా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పార్కింగ్ ప్రదేశాలలో దాదాపు 5వేల వాహనాలను నిలుపుదల చేసేందుకు అవకాశం ఉందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి తాను, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ యంత్రాంగానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు. పాగాలంకరణ ముగిసిన వెంటనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రవాణా సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో టోల్‌గేట్, వలయ రహదారి (రింగురోడ్డు) యజ్ఞవాటిక పార్కింగు ప్రదేశం, మల్లమ్మ కన్నీరు ప్రాంతం. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రక్కన గల పార్కింగు ప్రదేశం, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం మొదలైన ప్రదేశాలను పరిశీలించారు. అన్ని పార్కింగు ప్రదేశాలలో కూడా అవసరమైన సదుపాయాలు ఉండాలన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డి.ఆర్.ఓ పద్మజ,ఆత్మకూరు ఆర్‌డిఓ మిరియాల దాసు, అన్నిశాఖల జిల్లా అధికారులు, మార్కాపురం,దోర్నాల, తెలంగాణా,కర్ణాటక ప్రాంతాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం షేరింగ్ అంటే...

తిరుపతి, ఫిబ్రవరి 9 తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బీజేపీతో పొత్తుకు సిద్ధమయ్యారు. ఆయన ఎప్పటి నుంచో బీజేపీతో కలసి ప్రయాణం చేయాలని భావిస్తున్నారు. ఇప్పటి నుంచి కాదు 2019 ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఆయన టోన్ మార్చేశారు. అప్పటి వరకూ ప్రత్యేక హోదా ఇవ్వని ఎన్డీఏ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన చంద్రబాబు మోదీపై ఎన్నికల సందర్భంగా వ్యక్తిగత విమర్శలకు కూడా దిగారు. అప్పటి ఎన్నికల ప్రచారంలో అమిత్ షా సయితం చంద్రబాబును తమ పంచన చేరనీయమని తెగేసి చెప్పారు. అయితే రాజకీయాలు కాబట్టి ఏవైనా జరగొచ్చు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎవరితోనైనా పొత్తు పెట్టుకోవచ్చు. అందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు. దాదాపు కొన్నేళ్ల పాటు ఢిల్లీ వైపు కూడా చూసేందుకు చంద్రబాబు ఇష్టపడలేదు. మోదీ అండ్ కో కు తన ఫేస్ ను చూపించలేక ఆయన ఏపీకే పరిమితమయ్యారు. ఆ తర్వాత వివిధ సమావేశాలకు హాజరవుతూ దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. తాజాగా చంద్రబాబు ఢిల్లీ ప్రయాణమవుతున్నారు. ఈరోజు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు పార్టీ అగ్రనేతలతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. అయితే మోదీని కలిసే అవకాశం ఉండకపోవచ్చు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోనూ, కుదిరితే అమిత్ షాతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఎల్లుండి ఆయన వారితో సమావేశమై వచ్చే ఎన్నికల్లో పొత్తులు, సీట్లు సర్దుబాటు వంటి అంశాలపై చర్చించనున్నారు. కాకుంటే ఇప్పుడు బీజేపీతో పొత్తు వల్ల చంద్రబాబుకు ఎంత మేరకు లాభం? ఏ విధంగా నష్టమన్న చర్చ జరుగుతుంది. లీడర్ల నుంచి క్యాడర్ వరకూ పొత్తు వద్దే వద్దంటున్నారు. అయితే పొత్తు కుదుర్చుకోవడానికి బీజేపీ ఎలాంటి షరతులు విధిస్తుందన్న టెన్షన్ టీడీపీలో ఉంది. ఒకవేళ బీజేపీ ముఖ్యమంత్రి పదవి షేరింగ్ అంటుందేమోనన్న బెంగ కూడా లేకపోలేదు. చంద్రబాబు రెండున్నరేళ్లు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రెండున్నరేళ్ల పాటు సీఎం పదవి ఉంటేనే తాము పొత్తుకు సిద్ధమవుతామని చెప్పే అవకాశాలు కూడా కొట్టిపారేయలేం. ఎందుకంటే పొత్తు బీజేపీ కంటే చంద్రబాబుకే అవసరం ఎక్కువగా కనిపిస్తుంది. ఎలక్షనీరింగ్ చేయాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్దతు తప్పనిసరి. జగన్ ను ఎదుర్కొనాలంటే మోదీ మద్దతు తప్పనిసరి. అయితే సీఎం పదవి షేరింగ్ కు చంద్రబాబు అంగీకరించరని సైకిల్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే సీట్లు ఎక్కువగా ఇస్తారమో కాని, షేరింగ్ ను మాత్రం అంగీకరించబోరంటున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పై ఎంత వ్యతిరేకత ఉందో? బీజేపీపై కూడా అదే స్థాయిలో వ్యతిరేకత ఉంది. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించకపోవడం, విశాఖ అంశాలతో బీజేపీ ఓట్ల శాతం కూడా ఒక శాతానికి మించవు. అలాంటి పరిస్థితుల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుంటే కొన్ని వర్గాలు దూరమవ్వడమే కాకుండా, చంద్రబాబు అండ్ కో కు మరింత కొందరు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# క్రిష్ణాలో నాలుగు సీట్లపై పవన్

విజయవాడ, ఫిబ్రవరి 9 ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ - జనసేన మధ్య సీట్ల పంచాయితీ తేలటం లేదు. ఇప్పటి వరకు జనసేనకు ఎన్ని సీట్లను కేటాయిస్తారనే అంశంపై తెలుగుదేశం పార్టీ క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో జనసేన పార్టీ నేతల్లో టెన్షన్ పెరిగిపోతోంది. సోషల్ మీడియాలో మాత్రం సీట్ల కేటాయింపుపై ఇప్పటికే ప్రచారం హ్వారెత్తుతోంది. 23 అసెంబ్లీ సీట్లతో పాటు రెండు పార్లమెంట్ సీట్లు కేటాయిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో జనసేన నాలుగు స్థానాలు డిమాండ్ చేస్తుంటే...తెలుగుదేశం పార్టీ ఎన్ని ఇవ్వడానికి రెడీగా ఉంది.. ఏ ఏ సీట్లు ఇస్తుందన్న దానిపై స్పష్టత లేకుండా పోయింది. ప్రధానంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ-జనసేన మధ్య సీట్ల పంచాయితీ ఇంకా కొలిక్కిరావడం లేదు. జిల్లాలో జనసేన కచ్చితంగా నాలుగు స్థానాలను కేటాయించాలని...తెలుగుదేశం పార్టీకి తేల్చి చెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానికంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా...అటు టీడీపీ నేతలు కూడా సీట్ల కేటాయింపు వ్యవహారంలో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. జనసేన నాలుగు సీట్లు అడుగుతుంటే...రెండు లేదా మూడు సీట్లకు మాత్రమే పరిమితం చేయాలనే ఉద్దేశంలో టీడీపీ స్థానిక నేతలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణా జిల్లాలో జనసేన విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ, పెడన, కైకలూరు స్థానాల్లో పోటీ చేయాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. నాలుగు స్థానాల్లో జనసేన నుంచి పోటీ చేయటానికి అభ్యర్థులు కూడా పూర్తి స్థాయిలో రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ నుంచి క్లారిటీ కోసం మాత్రమే ఎదురుచూస్తున్నారు. కీలకమైన బెజవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే...ఇక్కడ నుంచి జనసేన అభ్యర్థిగా పోతిన వెంకట మహేష్ దాదాపు ఖరారైనట్టుగానే పార్టీ వర్గాల సమాచారం. అయితే టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, జలీల్ ఖాన్...తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. కైకలూరు సీటును కూడా జనసేన ఆశిస్తోంది. ఇక్కడ నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పోటీ చేస్తారన్న వార్తలు వస్తున్నాయి. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కుమారుడి కోసం పెడన సీటును జనసేన నేతలు కోరుతున్నారు. మరోవైపు ఇదే అసెంబ్లీ సీటును మాజీ మంత్రి కాగిత వెంకట్రావు కుమారుడు కాగిత కృష్ణప్రసాద్ ఆశిస్తున్నారు. ఆయన గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇప్పటికే కాగిత కృష్ణప్రసాద్ తన ప్రచార కార్యక్రమాల్లో పెడన టీడీపీ



ఎమ్మెల్యే అభ్యర్థి అంటూ...స్టిక్కర్లు వేసుకొని కార్యక్రమాలు చేస్తున్నారు నియోజకవర్గంలో కాపు, గౌడ వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండటంతో...ఎవరికి టికెట్ ఇవ్వాలనే అంశంపై టీడీపీ, జనసేన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అవనిగడ్డ నియోజకవర్గం సీటు కూడా తమకే ఇవ్వాలని జనసేన నేతలు డిమాండ్ చేస్తున్నారు. జనసేన అభ్యర్థిగా విక్కుర్తి శ్రీనివాస్ పోటీ చేసేందుకు రెడీ అవుతున్నారు. శ్రీనివాస్ ఇప్పటికే పవన్ కల్యాణ్ ను కూడా కలిశారని, ఆయన నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆయన సన్నిహితులు చెప్పుకుంటున్నారు. ఇక్కడి నుంచి సీనియర్ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే జనసేన మాత్రం ఖచ్చితంగా ఈ టికెట్ ఇవ్వాల్సిందేనని తెలుగుదేశంపార్టీపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది.

# రాజ్యసభ రేసులో టీడీపీ

విజయవాడ, ఫిబ్రవరి 9 తెలుగుదేశం పార్టీ రాజ్యసభ ఎన్నికలకు రెడీ అవుతుంది. నోటిఫికేషన్ కూడా విడుదలయింది. ముగ్గురు అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించారు. సంఖ్యాబలం ప్రకారం మూడు వైసీపీ ఖాతాలోనే పడాలి. కానీ ప్రస్తుత రాజకీయాలు మారిపోవడంతో అన్ని రకాలుగా ఆలోచించి చంద్రబాబు అభ్యర్థిని నిర్ణయించారని చెబుతున్నారు. అయితే అధికారికంగా ఇంకా పేరును వెల్లడించకపోయినప్పటికీ అనధికారికంగా రాజ్యసభ అభ్యర్థికి ఎవరో తెలుగుదేశం పార్టీ నేతలు ఆఫ్ ది రికార్డు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే రాజ్యసభ స్థానాన్ని కూడా గెలవడం ఖాయమని టీడీపీ వర్గాలు నమ్మకంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల అయింది. రాజ్యసభ ఎన్నికలు మూడింటికి జరిగితే ఎమ్మెల్యేల బలాబలాలను పరిశీలిస్తే మూడు వైసీపీకే దక్కాల్సి ఉంటుంది. కానీ ఏదైనా జరగొచ్చు. ఎమ్మెల్సీ ఎన్నికల మాదరిగా క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశముంది. 151 మంది సభ్యులున్న వైసీపీకి ఈ మూడు గెలవడం సాధారణ పరిస్థితుల్లో అయితే నల్లేరు మీద నడకే. అయితే అభ్యర్థులను ప్రకటించడం, నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు చేయడంతో అనేక మంది వైసీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. ముగ్గురు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామాలు చేశారు. అలాంటి పరిస్థితుల్లో మిగిలిన అసంతృప్త ఎమ్మెల్యేలు ఓట్లు ఎటు వేస్తారో చెప్పలేని పరిస్థితి. తమకు టిక్కెట్ ఇవ్వని కారణంగా ఆ కోపాన్ని ఇలా తీర్చుకునే అవకాశం కూడా ఉంది. అందుకే చంద్రబాబు ఒక స్థానంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. అయితే వైసీపీ మార్పులు, చేర్పులు చేపట్టిన నియోజకవర్గాలతో పాటు, టిక్కెట్ దక్కని ఎమ్మెల్యేలలో ఎక్కువ మంది ఎస్సీ, బీసీ వర్గానికి చెందిన వారే ఉన్నారంటున్నారు చంద్రబాబు. అందుకే ఈసారి కూడా పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్యను బరిలోకి దించాలని, లభించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ కార్డు పనిచేసినట్లే.. ఇప్పుడు ఎస్సీ కార్డుతో కొట్టాలని చంద్రబాబు రెడీ అయిపోయారంటున్నారు.

## డి ఎస్ సి ప్రకటన లో రెండు సంవత్సరాలు అప్రెంటిస్ విధానం ను రద్దు చేయాలి - ఆప్టా

విభారె న్యూస్ ఫిబ్రవరి 08 కర్నూలు (జిల్లా ప్రతినిధి)...ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించటానికి అవసరమైన శిక్షణ తీసుకొని, నైపుణ్య పరీక్ష గా టెట్ వ్రాసి మరల ఎన్నో వేల మందిలో పోటీ పరీక్ష లో మొదటి స్థానంలో వచ్చి ఉద్యోగం లో ప్రవేశించే ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానం వద్దని అనేక సంవత్సరాలు పోరాడి దాన్ని రద్దు చేపించుకొంటే మరల అదే విధానం అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ విడుదల చేయటం చాలా దారుణం. ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ గా ఈ విధానం ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు ఏ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు ప్రకటన లో తెలియ చేసారు. అప్రెంటిస్ విధానం పై తమ యొక్క వ్యతిరేకతను తెలియ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి, రాష్ట్ర ఉన్నత అధికారులకు లేఖలు పంపడం జరిగింది అని తెలియ చేశారు. అప్రెంటిస్ విధానం ను మరల అమల్లోకి తేవటాన్ని శ్రమ దోపిడీ గా చెప్పవచ్చు. గత కొన్నేళ్లుగా ఉద్యోగ భర్తీ చేయకుండా వుండి , ఇప్పుడు మరల రెండు సంవత్సరాలు అప్రెంటిస్ విధానం పెట్టడం ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థుల కు ఒక శరాఘాతం గా చెప్పవచ్చు. గతం లో ఉపాధ్యాయ సంఘాల నిరంతర పోరాట ఫలితంగా అప్రెంటిస్ విధానం రద్దు చేయడం జరిగింది మరల దానిని పునరుద్ధరణ చేసే విధానం వెంటనే మానుకోవాలని ఆప్టా తరపున ప్రభుత్వం ను కోరటం జరిగింది.

## సీతారాముల గుడికి విరాళం....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 9 బేతంచేర్ల మండలం, బుక్కాపురం గ్రామంలో శ్రీ సీతారాముల గుడి నిర్మాణమునకు డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి స్వగృహంలో రూ. 25,000/- విరాళం డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి చేతుల మీదుగా బుక్కాపురం గ్రామస్థులకు లక్ష్మణ, కృష్ణుడు, శేఖర్ ,మల్లిఖార్జున లకు శుక్రవారం అందజేశారు.

## ప్రతి విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రను మింగించండి

### - జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు



విభారె న్యూస్ శ్రీశైలం ఫిబ్రవరి 09.ప్రతి విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రను మింగించి చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం శ్రీశైలం జిల్లా పరిషత్ హైస్కూల్ లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించి 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగిస్తున్నామన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో మొత్తం 4,11,270 పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, అంగన్వాడీలు, పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను తప్పనిసరిగా మింగించాలన్నారు. 1-2 సంవత్సరాల వయసు చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి తల్లి పాలతో కలిపి చెంచా ద్వారా ఇవ్వాలని,2-19 సం. వయసు పిల్లలు మధ్యాహ్నము భోజనం తరువాత ఒక మాత్రను పూర్తిగా చప్పరించి నమిలి మింగించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు గైరు హాజరైన విద్యార్థులకు ఈనెల 16 వ తేది మాప్ అప్ రౌండ్ లో మాత్రలువేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డా. జఫరుల్లా, పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. షెహనాజ్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లు అక్రమ అరెస్టులు నిరసిస్తూ ర్యాలీ



కోసిగి,ఫిబ్రవరి 09(విభారె న్యూస్) ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కోసిగి మండలంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో బీరప్ప స్వామి దేవాలయం నుండి ర్యాలీగా బయలుదేరి వైయస్సార్ సర్కిల్ నందు రాస్తారోకో నిర్వహించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు వీరేష్ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు కోసిగి మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ఆశా వర్కర్లుకు గౌరవ వేతనం పేరుతోనా ప్రభుత్వము వెట్టిచాకిరి చేయించుకు ంటుందని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీరి వేతనాలు లేవని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అర్హత ఉన్నవారికి ఏఎన్ఎం గా ప్రమోషన్ కల్పించాలని సంక్షేమ పథకాల అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశ వర్కర్లను ప్రభుత్వము పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా అరెస్ట్ చేయడం ఆ ప్రజాస్వామ్యక చర్య అని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని వారు కోరారు ఇప్పటికైనా ప్రభుత్వము ఇలాంటి బెదిరింపు చర్యలు మానుకొని ఆశా వర్కర్లు ఎదుర్కొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ కోసిగి మండల నాయకులు సుజాతమ్మ పార్వతి చంద్రమ్మ సంధ్య ఇందిరమ్మ శ్రీదేవి చిట్టెమ్మ పద్మ రాధమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎమ్మిగనూరు లో మరో దారుణం..

- పట్ట పగలే వేట కొడవలి తో యువకుడిపై దాడి..
- కోర్టు గేటు బయట హత్య యత్నం..
- ప్రాణాపాయ స్థితిలో బూటు వీర నారాయణ..
- ఆర్థిక లావాదేవీలే దాడి కు కారణం..




విభారె న్యూస్ ఎమ్మిగనూరు ఫిబ్రవరి 9..ఎమ్మిగనూరు లో మరో దారుణం జరిగింది. వరస హత్య యత్నాలు, చోరీ తో పోలీసులకు సవాలు గా మారింది. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణం కోర్టు గేటు బయట యువకుడి ఓ వ్యక్తి పై వేట కొడవలి తో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నం చేశారు. దీంతో ఎమ్మిగనూరు ప్రజలు ఉలిక్కి పడ్డారు. పట్టణంలో ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదు. ఎమ్మిగనూరు కోర్టు లో హాజరు అయి బయటికి వచ్చిన వీర నారాయణ పై కురువ ఈరన్న వేట కొడవలి తో నరికాడు. దీంతో కురువ వీర నారాయణ తల ,మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. చేతి వేలు తెగిపోయింది. దాడి జరిగిన ప్రదేశంలో రక్తపు మడుగులో పడి ఉన్న వీర నారాయణ ను పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీర నారాయణ ను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి కు కారణం వీరి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలే. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం సీ బెలగల్ మండలం తూర్పు కంపాడు గ్రామానికి చెందిన కురువ సోమన్న కుమారుడు కురువ ఈరన్న , అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దదలురు గ్రామ బీసీ కాలానికి చెందిన కురువ పెద్దన్న కుమారుడు కురువ బూటు వీర నారాయణ లు అల్యూమినియం వ్యాపారం చేసే వారు. ఇందులో భాగంగా ఈరన్న సరుకు కోసం వీర నారాయణ కు 3 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. ఈరన్న కు వీర నారాయణ ఇవ్వవలసిన డబ్బు వాపాసు ఇవ్వకుండా ఉన్నాడు. దీంతో వారి మధ్య ఘర్షణలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో వీర నారాయణ పై ఈరన్న చెక్ బౌన్స్ కేసు ను ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టు లో 2023 లో వేశారు. ఈ వ్యవహారం లో వీరి మధ్య మనస్పర్ధలు తీవ్రమై హత్య యత్నానికి దారి తీసింది. దాడికి పాల్పడిన ఈరన్న ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మెనూ ప్రకారం మే భోజనం అందించాలి

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09- మెనూ ప్రకారమే నిరాశ్రయులకు భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు హరిజన వాడలో ఉన్న శైలజా సర్వీస్ సొసైటీ నైట్ సెంటర్ ను తనిఖీలు చేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ



నిరాశ్రయులు చెప్పిన సమస్యలను విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం హరిజన వాడలో శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఆల్బెండజోల్ మాత్ర తోనే నులి పురుగుల నిర్మూలన

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09- ఆల్బెండజోల్ మాత్ర తోనే నులి పురుగుల నిర్మూలన నివారించ వచ్చు అని దానివల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ నందు జాతీయ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. . కార్యాలయంలో ఆయన మాటాడుతూ నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్యాన్ని నివారించడానికి ప్రతి ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవంగా జరుపుకుం టున్నామన్నారు. 19 ఏళ్ల వయసులోపు వారికి ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందని చెప్పారు. డిప్యూటీ డి యమ్ హెచ్ ఓ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో, అంగన్వాడీ కేంద్రాల యందు ఈ రోజు ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200 మిల్లీ గ్రాములు) నీళ్లలో కలిపి తాపించాలని, 2 నుం చి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత మిం గకుండా, చప్పరించేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. ఎమ్ఈఓ. వైయస్ ఆర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్. స్కూల్ హెడ్ మాస్టర్. టీచర్లు. విద్యార్థులు పాల్గొన్నారు.



## కోడుమూరు కాంగ్రెస్ టికెట్‌కు ఈ లాజరస్ దరఖాస్తు..



విభారె న్యూస్ ఫిబ్రవరి 09 కర్నూలు (జిల్లా ప్రతినిధి).. కాంగ్రెస్ పార్టీ తరపున కోడుమూరు అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తును సమర్పించారు. శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్నభవన్ లో నియోజక వర్గ నాయకులతో కలిసి పార్టీ టికెట్ కోసం ధరఖాస్తును సమర్పించారు. ఈ సందర్భంగా లాజరస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పిసిసి అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ పార్టీ తోనే పేద,బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధితో పాటు కోడుమూరు నియోజక వర్గం అభివృద్ది కూడా కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ది కోసం ముందుకు వస్తుందని, రాష్ట్ర ప్రజలు తమ కోసం తమ బిడ్డల భవిష్యత్తు కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీనీ ఆదరిస్తారనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సిసెల్ ఛైర్ పర్సన్ సాకే శంకర్, కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు, నియోజకవర్గ నాయకులు రవి ప్రకాష్, రవి కుమార్, నియోజకవర్గ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## చాబోలులో పలువురు మైనారిటీలు బిజెపి లో చేరిక



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 09- నంద్యాల మండలం చాబోలు గ్రామంలో పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు బిజెపి పార్టీ లో చేరారు. ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చాబొలు గ్రామ మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు అధ్వర్యంలో చాబోలు గ్రామంలో మైనార్టీ మహిళా నాయకురాలు హసీనా సమక్షంలో మైనార్టీ నాయకులు బిజెపి లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా దేశాన్ని ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి పదంలో తీసుకొని పోతున్నారని అన్నారు. మైనార్టీలు బిజెపి కి వ్యతిరేకం కాదన్నారు. ప్రజలకు కావల్సింది అభివృద్ధి మాత్రమే అన్నారు. బిజెపి ప్రభుత్వంలో ఎన్నో పదకాలు అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా విపత్తులో వ్యాక్సిన్ ఇచ్చి ఎందరో ప్రాణాలు కాపాడారు అన్నారు. పేదలు కడుపునిండా తినడానికి ఉచిత బియ్యం ఇస్తున్న ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ రోజునుంచి బిజెపి చేస్తున్న పథకాలు ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. మైనార్టీ మహిళా మొదటి రోజు నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమం విజయవంతం అయిందని బిజెపి నాయకులు తెలిపారు.

## పాఠశాల చేరిన ధనుష్...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 9 డోన్ పట్టణం కొండపేట ప్రాంతానికి చెందిన ధనుష్ అనే అబ్బాయి స్థానిక మోడల్ స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుకుంటున్నాడు. కొన్ని అనివార్యకారణాల వలన ధనుష్ కొద్ది రోజుల నుంచి స్కూల్ కి వెళ్లడం లేదని స్ఫూర్తి సభ్యుడు హుమాయున్ ధనుష్ గురించి స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు మధు కి తెలుపగా ధనుష్ ని విచారించి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జాస్మిన్ తో మాట్లాడి అబ్బాయిని స్కూల్లో చేర్పించడం జరిగింది. అలాగే ఇంటి దగ్గర వసతి ఇబ్బందిగా ఉండటం వల్ల పాత బస్టాండ్ లో గల సాయిరామ్ హాస్టల్ లో పెట్టడం జరిగింది. ధనుష్ కి చదువు విషయంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కి ఉపాధ్యాయ బృందానికి వసతి కల్పించిన సాయిరామ్ హాస్టల్ యజమాని నందికేశ్వర రావు కి స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190